विधायी II अनुभाग
राजभाषा खण्ड

रजिस्ट्री सं. डि २२१
Registered No. D. 221
రిజిస్ట్రీ సంఖ్య డి. 221

मूल्य: ५.०० रुपये
Price Rs. 5.00 Paise.
మూల్యము రూ. 5.00 పైసలు.

# भारत का राजपत्र
# The Gazette of India
# భారత రాజపత్రము

असाधारण
**EXTRAORDINARY**
అసాధారణ

भाग XVI अनुभाग 1
**Part XVI Section 1**
భాగము XVI అనుభాగము 1

प्राधिकार से प्रकाशित
**PUBLISHED BY AUTHORITY**
ప్రాధికారముద్వారా ప్రచురింపబడినది

| | | | | |
|---|---|---|---|---|
| सं. २ | नई दिल्ली | गुरुवार | ४ जुलै 1991/१३ आषाढ़ १९१३ शक | खंड ६ |
| No. 2 | New Delhi | Thursday | 4th July, 1991/13th Ashadh, 1913 Saka | Vol.-6 |
| సంఖ్య 2 | న్యూఢిల్లీ | గురువారము | 4 జూలై, 1991/13 ఆషాఢ, 1913 శక | సంపుటము-6 |

## MINISTRY OF LAW AND JUSTICE
## LEGISLATIVE DEPARTMENT

New Delhi, 26th March, 1990/5 Chaitra 1912 Saka

The Translations in Telugu of the following, namely:-

(1) The Provincial Small Cause Courts Act, 1887 (Act 9 of 1887), (2) The Arbitration Act, 1940 (Act 10 of 1940), (3) The Prevention of Food Adulteration Act, 1954 (Act 37 of 1954), (4) The Indian Partnership Act, 1932 (Act 9 of 1932), (5) The Railway Property (Unlawful Possession) Act, 1966 (Act 29 of 1966) and (6) The Transfer of Property Act, 1882 (Act 4 of 1882) are hereby published under the authority of the President and shall be deemed to be the authoritative Texts thereof in Telugu under clause (a) of Section 2 of the Authoritative Texts (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

## శాసన మరియు న్యాయ పాలన మంత్రిత్వ శాఖ
## (శాసన నిర్మాణ విభాగము)

న్యూ ఢిల్లీ, 26 మార్చి, 1990/5 చైత్ర 1912 శక

ఈ క్రింది చట్టములు, అనగా:-

(1) ప్రావిన్షల్ స్మాల్ కాజ్ కోర్టుల యాక్టు, 1887 (1887లోని 9వ చట్టము), (2) ఆర్బిట్రేషన్ యాక్టు, 1940 (1940లోని 10వ చట్టము), (3) ప్రివెన్షన్ ఆఫ్ ఫుడ్ అడల్టరేషన్ యాక్టు, 1954 (1954లోని 37వ చట్టము), (4) ఇండియన్ పార్ట్నర్ షిప్ యాక్టు, 1932 (1932లోని 9వ చట్టము), (5) రైల్వే ప్రాపర్టీ (అన్ లాఫుల్ పొజెషన్) యాక్టు, 1966 (1966లోని 29వ చట్టము) మరియు (6) ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్టు,

1882 (1882లోని 4వ చట్టము) లయొక్క తెలుగు అనువాదములు, రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందు మూలముగా ప్రచురించడమైనది. ఈ అనువాదములను ఆ చట్టములకు, ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదము లోని ఖండము (ఏ) క్రింద ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావింప వలెను.

# భారత భాగస్వామ్య చట్టము, 1932

(1932 లోని 9వ చట్టము)

(8 ఏప్రిల్ 1932)

భాగస్వామ్యమునకు సంబంధించిన శాసనమును వివరించి, సవరించుటకైన చట్టము.

భాగస్వామ్యమునకు సంబంధించిన శాసనమును వివరించి, సవరించుట ఉపయుక్తమైనందున ఇందుమూలముగా ఈ క్రింది విధముగా శాసనము చేయబడినది:-

## అధ్యాయము - I

### ప్రారంభిక

1. (1) ఈ చట్టమును భారత భాగస్వామ్య చట్టము, 1932 అని పేర్కొనవచ్చును. సంగ్రహనామము విస్తరణ మరియు ప్రారంభము.

(2) ఇది జమ్మూ-కాశ్మీరు రాజ్యము మినహా యావద్భారత దేశమునకు విస్తరించును.

(3) 69వ పరిచ్ఛేదము మినహా, ఇది, 1932 అక్టోబరు 1వ దినమున అమలులోనికి వచ్చును. 69వ పరిచ్ఛేదము 1933 అక్టోబరు 1వ దినమున అమలులోనికి వచ్చును.

2. ఈ చట్టములో విషయగతమైన లేక సందర్భగతమైన వైరుధ్యమేదేని ఉన్ననే తప్ప-- నిర్వచనములు.

(ఏ) "ఫర్మ యొక్క కార్యము" అనగా ఫర్ము యొక్క భాగస్వాములందరుగాని, ఎవరేని భాగస్వామిగాని, ఏజెంటుగాని చేసినద్కై, ఫర్మచేగాని, ఫర్మపై గాని అమలుపరచబడదగు హక్కును కలుగజేయు ఏదైన కార్యము లేక కార్యలోపము అని అర్థము;

(బీ) "వర్తకము" అను పదపరిధియందు ప్రతియొక వ్యాపారము, ఉపజీవిక మరియు వృత్తి చేరియుండును;

(సీ) "విహిత" అనగా ఈ చట్టము క్రింద చేసిన నియమములద్వారా విహిత పరచిన అని అర్థము;

(డీ) ఫర్మకు లేక అందలి భాగస్వామికి సంబంధించి ఉపయోగింపబడినపుడు "అన్యవ్యక్తి" అనగా ఫర్మలో భాగస్వామికాని ఎవరేని వ్యక్తి అని అర్థము;

(ఈ) ఈ చట్టములో ఉపయోగింపబడి, నిర్వచింపబడక భారత కాంట్రాక్టు చట్టము, 1872 లో నిర్వచింపబడిన పదబంధములు ఆ చట్టములో వాటికి ఈయబడిన అర్థములనే కలిగియుండును. 1872 లోని 9వ చట్టము.

3. భారత కాంట్రాక్టు చట్టము, 1872 యొక్క రద్దు చేయబడని నిబంధనలు ఈ చట్టమునందలి అభివ్యక్త నిబంధనలకు అసంగతముగా ఉన్నంతమేరకు తప్ప, ఫర్మలకు వర్తించుచుండును. 1872 లోని 9వ చట్టపు నిబంధనల వర్తింపు. 1872 లోని 9వ చట్టము.

## అధ్యాయము - 2

### భాగస్వామ్య లక్షణములు

"భాగస్వామ్యము" "భాగస్వామి", "ఫర్మ్" మరియు "ఫర్మ్ పేరు" యొక్క నిర్వచనము.

4. ఒక వర్తకమునందలి లాభములను పంచుకొనుటకు కరారు చేసికొనిన వ్యక్తు లందరుగాని, వారిలోనుండి ఎవరైనను వారందరి కొరకు వ్యవహరించుచుగాని ఆ వర్తకమును సాగించినపుడు ఆ వ్యక్తులమధ్య ఉండు సంబంధము "భాగస్వామ్యము" అనబడును.

భాగస్వామ్యముగా ఏర్పడిన వ్యక్తులను వ్యక్తిగతముగ "భాగస్వాములు" అనియు, సమష్టిగా "ఫర్మ్" అనియు అందురు. ఆ వర్తకమును వారు ఏ పేరుతో సాగింతురో ఆ పేరును "ఫర్మ్ పేరు" అందురు.

భాగస్వామ్యము ప్రతిపత్తినిబట్టి ఉత్పన్నము కాదు.

5. భాగస్వామ్య సంబంధము ప్రతిపత్తివలన కాక, కాంట్రాక్టు వలన ఉత్పన్నమగును;

ప్రత్యేకముగా, కుటుంబ సభ్యులుగ తమ కుటుంబ వర్తకమును సాగించుచున్న హిందూ అవిభక్త కుటుంబములోని సభ్యులు గాని, భార్యాభర్తలుగ వర్తకమును సాగించుచున్న బర్మా బౌద్ధ భార్యాభర్తలు గాని అట్టి వర్తకముతో భాగస్వాములుకారు.

భాగస్వామ్యపు ఏర్పాటు ఉన్నదో లేదో నిర్ధారణ చేయు పద్ధతి.

6. వ్యక్తుల సముదాయము ఫర్మ్ యేనా కాదా అనిగాని, ఎవరేని వ్యక్తి ఫర్మ్‌లో భాగస్వామియగునా కాదా అనిగాని నిర్ధారణ చేయుటలో, సంబద్ధమైన సంగతులన్నిటిని కలిపి పరిశీలించగా పక్షకారుల మధ్య ద్యోతకమగు వాస్తవిక సంబంధమును దృష్టియందుంచుకొనవలెను.

<u>విశదీకరణము 1:-</u> ఆస్తిలో సంయుక్త లేక ఉమ్మడి హితము కలిగియున్న వ్యక్తులు ఆ ఆస్తిపై వచ్చు లాభములను లేక స్థూల ఆదాయమును పంచుకొనినంత మాత్రమున ఆ వ్యక్తులు భాగస్వాములు కారు.

<u>విశదీకరణము 2:-</u>ఒక వ్యక్తి వర్తకపు లాభములలో వాటాను పొందినంత మాత్రమునకాని, లాభములు గడించుటపై సమాశ్రితమైయుండెడి, లేక గడింపబడిన లాభముల హెచ్చు, తగ్గులనుబట్టి మారుచుండెడి చెల్లింపుపొందినంత మాత్రమున గాని, ఆ వర్తకమును సాగించుచున్న వ్యక్తులతో అతడు భాగస్వామి కాడు.

మరియు ప్రత్యేకముగా, ఈ క్రింది సందర్భములలో అనగా-

(ఏ) ఏదేని వర్తకము నడుపుచున్న లేక నడుపబోవుచున్న వ్యక్తులకు అప్పు ఇచ్చు వ్యక్తి,

(బీ) సేవకుడు లేక ఏజెంటు ప్రతిమూల్యముగా,

(సీ) మృత భాగస్వామియొక్క వితంతువు లేక బిడ్డ, వార్షికముగా, లేక

(డీ) వ్యాపారఖ్యాతిని (గుడ్‌విల్‌ను) గాని, అందలి వాటానుగాని విక్రయించి నందుకు ప్రతిఫలముగా, ఆ వర్తకపు పూర్వపు సొంతదారు, లేదా ఆంశిక సొంతదారు,

అట్టి వాటాను లేక చెల్లింపును పొందినంతమాత్రమున అతడు ఆ వర్తకమును సాగించు చున్న వ్యక్తులతో భాగస్వామికాడు.

యథేచ్ఛా భాగస్వామ్యము.

7. తమ భాగస్వామ్యపు ఏర్పాటు కాలావధిని గురించిగాని, ఆ ఏర్పాటును అంత మొందించుటను గురించిగాని భాగస్వాముల మధ్యగల కాంట్రాక్టులో నిబంధన ఏదియు లేనియెడల, ఆ భాగస్వామ్యము "యథేచ్ఛా-భాగస్వామ్యము" అగును.

8. ఒక వ్యక్తి మరొక వ్యక్తితో కొన్ని ప్రత్యేకమైన వ్యాపారకృత్యములందు లేక వ్యాపార కార్యకలాపములందు భాగస్వామి కావచ్చును. ప్రత్యేక భాగస్వామ్యము.

## అధ్యాయము - 3

## భాగస్వాములలో (ఒకరికి మరొకరితో) ఉండు సంబంధములు

9. భాగస్వాములందరికి అత్యధిక ప్రయోజనము చేకూరునట్లు ఫర్మ్ యొక్క వర్తకమును సాగించుటకును, వారిలో ఒకరిపట్ల మరొకరు న్యాయసమ్మతముగను, విశ్వసనీయముగను వ్యవహరించుటకును, ఏ భాగస్వామికైనను, అతని శాసనిక ప్రతినిధికైనను ఫర్మ్‌కు సంబంధించిన విషయములన్నిటిని గూర్చి యథార్థమైన లెక్కలను, పూర్తి సమాచారమును ఇచ్చుటకును భాగస్వాములు బద్ధులైయుందురు.

భాగస్వాముల సాధారణ కర్తవ్యములు.

10. ప్రతి భాగస్వామియు, ఫర్మ్‌యొక్క వర్తకమును నిర్వహించుటలో తన కపటము వలన ఫర్మ్‌కు కలిగిన ఏదేని నష్టమునకై ఫర్మ్‌కు నష్టపూర్తి చేయవలెను.

కపటము వలన కలిగింపబడిన నష్టమునకై నష్టపూర్తి చేయవలసిన కర్తవ్యము.

11. (1) ఈ చట్టపు నిబంధనలకు లోబడి, ఫర్మ్‌యొక్క భాగస్వాముల పరస్పర హక్కులను, కర్తవ్యములను ఆ భాగస్వాములు తమ మధ్య ఏర్పరచుకొను కాంట్రాక్టు ద్వారా నిర్ధారణ చేసికొనవచ్చును. అట్టి కాంట్రాక్టు అభివ్యక్తమైనదిగాని, వ్యవహార సరళినిబట్టి గర్భితమైనదిగాని కావచ్చును.

భాగస్వాముల మధ్య కాంట్రాక్టు ద్వారా వారి హక్కుల మరియు కర్తవ్యముల నిర్ధారణ.

అట్టి కాంట్రాక్టు, భాగస్వాములందరి సమ్మతితో మార్పు చేయబడవచ్చును; ఆ సమ్మతి అభివ్యక్తమైనదిగాని, వ్యవహార సరళినిబట్టి గర్భితమైనదిగాని కావచ్చును.

(2) భారత కాంట్రాక్టు చట్టము, 1872 లోని 27వ పరిచ్ఛేదమునందు ఏమి యున్నప్పటికిని, ఫర్మ్‌యొక్క భాగస్వామి ఎవరైనను అట్లు భాగస్వామిగా ఉన్నంత వరకు, ఆ ఫర్మ్‌యొక్క వర్తకము కానట్టి ఏ వర్తకమును గాని సాగించరాదని అట్టి కాంట్రాక్టులలో నిబంధనలను పొందుపరచవచ్చును.

వ్యాపారమును అవరోధించు కరారులు.

12. భాగస్వాముల మధ్యగల కాంట్రాక్టుకు లోబడి-

వర్తక నిర్వహణ.

(ఏ) ప్రతి భాగస్వామికి వర్తక నిర్వహణలో పాల్గొనుటకు హక్కు ఉండును;

(బీ) ప్రతి భాగస్వామియు, వర్తక నిర్వహణలో తన కర్తవ్యములను తగు జాగరూకతతో నిర్వర్తించవలసియుండును;

(సీ) వర్తకమునకు సంబంధించిన సామాన్య విషయములను గూర్చి ఏర్పడు ఏదేని విభేదమును అధికసంఖ్యాక భాగస్వాముల నిర్ణయమును బట్టి పరిష్కరించవచ్చును; ఆ విషయమును పరిష్కరించుటకు పూర్వము ప్రతి భాగస్వామికి తన అభిప్రాయమును అభివ్యక్తపరచుటకు హక్కు ఉండును. అయితే భాగస్వాములందరి సమ్మతిలేనిదే వర్తకపు స్వభావములో ఎట్టి మార్పుచేయరాదు; మరియు

(డీ) ప్రతి భాగస్వామికి, ఫర్మ్‌యొక్క పుస్తకములలో ఏదియైనను అందుబాటులో ఉండవలెను; దానిని తనిఖీ చేయుటకును, దాని నకలును తీసికొనుటకును అతనికి హక్కు ఉండును.

13. భాగస్వాముల మధ్యగల కాంట్రాక్టుకు లోబడి-

పారస్పరిక హక్కులు, దాయిత్వములు.

(ఏ) వర్తక నిర్వహణలో తాను పాల్గొనినందుకు ప్రతిమూల్యము పొందుటకు భాగస్వామికి హక్కు ఉండదు;

(బి) ఫర్ము గడించిన లాభములను సమానముగ పంచుకొనుటకు భాగస్వాములకు హక్కు ఉండును; ఫర్ముకు కలిగిన నష్టముల విషయమున వారు సమానముగా అభిదాయము చెల్లించవలెను;

(సి) తాను పెట్టిన మూలధనముపై వడ్డీ పొందుటకు భాగస్వామికి హక్కు ఉన్న యెడల, ఆ వడ్డీని లాభముల నుండి మాత్రమే చెల్లించవలసియుండును;

(డి) వర్తకమునకై తాను పెట్టుటకు అంగీకరించిన మూలధనపు మొత్తమునకు మించి ఏదేని చెల్లింపుచేయు లేక అడ్వాన్సుఇచ్చు భాగస్వామికి, దానిపై సాలీనా ఆరు శాతము రేటు చొప్పున వడ్డీ పొందుటకు హక్కు ఉండును;

(ఇ) ఫర్ము, భాగస్వామికి–

(i) వర్తకమును సాధారణముగను, సక్రమముగను నిర్వహించుటలోను;

(ii) అత్యవసరపరిస్థితిలో, ఫర్మును నష్టమునుండి కాపాడుటకై సాధారణ ప్రజ్ఞగల ఒక వ్యక్తి తన సొంత వ్యవహారములో అటువంటి పరిస్థితులలో ఏ కార్యమును చేసియుండునో ఆ కార్యమును చేయుటలోను;

ఆ భాగస్వామి చేసిన చెల్లింపుల విషయమునను, అతనికి ఉపగతమైన దాయిత్వముల విషయమునను, నష్టపూర్తి చేయవలెను, మరియు

(ఎఫ్) భాగస్వామి ఫర్ము యొక్క వర్తకమును నిర్వహించుటలో, తన బుద్ధిపూర్వక ఉపేక్ష వలన ఫర్ముకు కలిగిన ఏదేని నష్టమునకై, ఫర్ముకు నష్టపూర్తి చేయవలెను.

ఫర్ము యొక్క ఆస్తి.

14. భాగస్వాముల మధ్యగల కాంట్రాక్టుకు లోబడి, ఫర్ముయొక్క ఆస్తియందు, ఫర్ము స్టాకు లోనికి మొదట తేబడిన, లేక ఫర్ముచే గాని, దాని తరఫునగాని, దాని ప్రయోజనములకై వర్తక సరళిలోగాని, కొనుగోలుద్వారా లేదా అన్యథా ఆర్జింపబడిన యావదాస్తియు, ఆస్తిలోని అన్ని హక్కులును, హితములును, మరియు వ్యాపార ఖ్యాతి (గుడ్‌విల్) కూడ చేరియుండును.

తద్విరుద్ధమైన ఉద్దేశము గోచరించిననే తప్ప, ఫర్ముకు చెందిన డబ్బుతో ఆర్జింపబడిన ఆస్తియు, ఆస్తిలోని హక్కులును, హితములును ఫర్ముకొరకు ఆర్జింపబడినవైనట్లు భావింపబడును.

ఫర్ము యొక్క ఆస్తి వినియోగము.

15. భాగస్వాముల మధ్యగల కాంట్రాక్టుకు లోబడి, ఫర్ము యొక్క ఆస్తిని భాగస్వాములు వర్తక ప్రయోజనముల కొరకు మాత్రమే ఉంచుకొని ఉపయోగించవలెను.

భాగస్వాములు గడించిన సొంత లాభములు.

16. భాగస్వాముల మధ్యగల కాంట్రాక్టుకు లోబడి–

(ఏ) భాగస్వామి ఫర్ముయొక్క ఏదేని వ్యవహారమువలనగాని, ఫర్ముయొక్క ఆస్తిని లేక ఫర్ముయొక్క వర్తక సంబంధమును లేక ఫర్ము పేరును ఉపయోగించుకొనుట వలన గాని ఏదేని లాభమును తాను పొందినచో, అతడు ఆ లాభములను లెక్క చూపి ఫర్ముకు చెల్లించవలెను;

(బి) ఫర్ముయొక్క వర్తకము వంటిదై, దానితో పోటీచేయు ఏదేని వర్తకమును భాగస్వామి సాగించినచో అతడు, ఆ వర్తకములో తనకు వచ్చిన లాభములన్నిటిని లెక్కచూపి ఫర్ముకు చెల్లించవలెను.

భాగస్వాముల హక్కులు, కర్తవ్యములు: ఫర్ములో మార్పు కలిగిన పిమ్మట.

17. భాగస్వాముల మధ్యగల కాంట్రాక్టుకు లోబడి–

(ఏ) ఫర్ముయొక్క సంఘటనలో ఏదేని మార్పు సంభవించినయెడల, పునస్సంఘటితమైన ఫర్ములోని భాగస్వాముల పరస్పర హక్కులు, కర్తవ్యములు

సాధ్యమైనంతమేరకు, ఆ మార్పునకు అవ్యవహిత పూర్వము అవి ఎట్లుండెనో అట్లే ఉండును;

ఫర్మ కాలావధి ముగిసిన పిమ్మట.

(బి) నియత కాలావధికై సంఘటితమైన ఫర్మ, ఆ కాలావధి ముగిసిన పిమ్మట వర్తకమును కొనసాగించినయెడల, భాగస్వాముల పరస్పర హక్కులు, కర్తవ్యములు యథేచ్ఛా-భాగస్వామ్యపు ప్రసంగతులకు సంగతముగ నున్నంతమేరకు, ఫర్మ కాలావధి ముగియుటకు పూర్వము అవి ఎట్లుండెనో అట్లే ఉండును;

అదనపు వ్యాపార కార్యకలాపములు నిర్వహింపబడిన యెడల.

(సి) ఒకటి లేక అంతకు మించిన వ్యాపార కృత్యములను లేక వ్యాపార కార్యకలాపములను నిర్వహించుటకు సంఘటితమైన ఫర్మ, ఇతర వ్యాపారకృత్యములను లేక వ్యాపారకార్యకలాపములను నిర్వహించినయెడల, ఆ ఇతర వ్యాపారకృత్యములు, లేక వ్యాపారకార్యకలాపముల విషయమున భాగస్వాముల పరస్పర హక్కులు, కర్తవ్యములు మొదట ఉండినట్లే వ్యాపారకృత్యములు, లేక వ్యాపారకార్యకలాపముల విషయములో అవి ఎట్లుండెనో అట్లే ఉండును.

## అధ్యాయము - 4

### అన్యవ్యక్తులతో భాగస్వాముల సంబంధములు

భాగస్వామి ఫర్మ యొక్క ఏజెంటుగా నుండుట.

18. ఫర్మ యొక్క వర్తక ప్రయోజనముల కొరకు భాగస్వామి ఈ చట్టపు నిబంధనలకు లోబడి ఫర్మ యొక్క ఏజెంటుగా ఉండును.

ఫర్మ ఏజంటుగా భాగస్వామికి ఉండు గర్భిత ప్రాధికారము.

19. (1) ఫర్మచే సాగింపబడు వర్తకము వంటి వర్తకమును మామూలు పద్ధతిలో సాగించుటలో భాగస్వామి చేసిన కార్యమునకు, 22వ పరిచ్ఛేదము యొక్క నిబంధనలకు లోబడి, ఫర్మ బద్ధమైయుండును.

ఫర్మ బద్ధమైయుండునట్లు చేయుటకు భాగస్వామికి ఈ పరిచ్ఛేదము ద్వారా ఒసగబడిన ప్రాధికారము అతని "గర్భిత ప్రాధికారము" అని పేర్కొనబడును.

(2) తద్విరుద్ధమైన ఏదేని వ్యాపారపు వాడుక గాని, ఆచారము గాని లేనప్పుడు, భాగస్వామి యొక్క గర్భిత ప్రాధికారము అతనికి ఈ క్రింది కార్యములను చేయుటకు అధికారమునొసగదు; అవేవనగా:-

(ఏ) ఫర్మ యొక్క వర్తకమునకు సంబంధించిన వివాదమును మధ్యవర్తి పరిష్కారమునకు సమర్పించుట,

(బి) ఫర్మ తరఫున బ్యాంకులో తనపేరుతో ఖాతా తెరచుట,

(సి) ఫర్మచే చేయబడిన ఏదేని క్లెయిమును లేక క్లెయిములో ఏదేని భాగమును రాజీ చేయుట లేక త్యజించుట,

(డి) ఫర్మ తరఫున వేయబడిన దావాను, లేక చర్యను ఉపసంహరించుట;

(ఈ) ఫర్మపై తేబడిన దావాలో లేక చర్యలో దాయిత్వమును దేనినైనను ఒప్పుకొనుట;

(ఎఫ్) ఫర్మ తరఫున స్థిరాస్తిని ఆర్జించుట;

(జి) ఫర్మకు చెందిన స్థిరాస్తిని అంతరణచేయుట,

(హెచ్) ఫర్మ తరఫున భాగస్వామ్యములో చేరుట.

భాగస్వామి యొక్క గర్భిత ప్రాధికారమును విస్తరింపజేయుట, పరిమితము చేయుట.

20. భాగస్వాముల మధ్య కాంట్రాక్టు ద్వారా, ఫర్ములోని భాగస్వాములు ఏ భాగస్వామి యొక్క గర్భిత ప్రాధికారమునైనను విస్తరింపచేయవచ్చును లేక పరిమితము చేయవచ్చును.

ఏదేని అట్టి పరిమితి ఉన్నప్పటికిని, ఒక భాగస్వామి తన గర్భిత ప్రాధికారము క్రిందకు వచ్చునట్టిదై, ఫర్ము తరఫున చేసిన ఏ కార్యమునకైనను, ఆ విషయమున అతడు ఎవరితో వ్యవహరించుచుండెనో ఆ వ్యక్తికి ఆ పరిమితిని గూర్చి తెలిసియున్ననే తప్ప, లేక అతడు భాగస్వామియని ఆ వ్యక్తికి తెలియకున్ననే లేక ఆ వ్యక్తి విశ్వసింప కున్ననే తప్ప, ఫర్ము బద్ధమైయుండును.

అత్యవసర పరిస్థితిలో భాగస్వామి ప్రాధికారము

21. అత్యవసరపరిస్థితిలో, ఫర్మును నష్టమునుండి కాపాడుటకై సాధారణ ప్రజ్ఞ గల ఒక వ్యక్తి తన సొంత వ్యవహారములో అటువంటి పరిస్థితులలో ఏ కార్యములను చేసియుండెడివాడో ఆ కార్యములన్నింటిని చేయుటకు భాగస్వామికి ప్రాధికారముండును; ఆ కార్యములకు ఫర్ము బద్ధమైయుండును.

ఫర్ము బద్ధమై యుండుటకు గాను కార్యమును చేయు పద్ధతి.

22. ఫర్ము తరపున భాగస్వామిగాని ఇతర వ్యక్తిగాని చేయు కార్యము, లేక నిష్పాదించు పత్రము విషయములో ఫర్ము బద్ధమైయుండుటకు గాను, ఫర్ము పేరుతో గాని, ఫర్ము బద్ధమైయుండవలెనను ఉద్దేశమును అభివ్యక్తముగా లేక గర్భితముగా తెలియజేయు ఏదేని ఇతర రీతిలోగాని ఆ కార్యమును చేయవలెను లేక ఆ పత్రమును నిష్పాదించవలెను.

భాగస్వామి చేసిన ఒప్పుకోళ్ల ప్రభావము.

23. ఫర్ము యొక్క కార్యకలాపములకు సంబంధించి భాగస్వామి ఒప్పుకొనినది లేక తెలియజేసినది, అది వర్తకపు మామూలు సరళిలో ఒప్పుకొనినదైనదో లేక తెలియ జేసినదైనదో ఫర్ముకు వ్యతిరేకముగా ఉపయోగింపదగు సాక్ష్యమగును.

క్రియాశీల భాగస్వామికి ఈయబడిన నోటీసు ప్రభావము.

24. ఫర్ము యొక్క వర్తకములో పరిపాటిగా వ్యవహరించు వ్యక్తికి, ఫర్ము యొక్క కార్యకలాపములకు సంబంధించి ఏ విషయమును గూర్చియైనను ఈయబడిన నోటీసు, ఆ భాగస్వామిచే లేక అతని సమ్మతితో ఫర్ము కపటమునకు గురిచేయబడిన సందర్భములో తప్ప, ఫర్ముకు ఈయబడిన నోటీసుగా వర్తించును.

ఫర్ము కార్యములకు భాగస్వామికి ఉండు దాయిత్వము

25. ప్రతియొక భాగస్వామి, అతడు భాగస్వామిగా ఉన్నప్పుడు చేయబడిన ఫర్ము యొక్క కార్యములన్నిటికి, ఇతర భాగస్వాములందరితో సంయుక్తముగాను, వేడిగాను కూడ బాధ్యుడైయుండును.

భాగస్వామి చేసిన దోష యుత కార్యము నకు ఫర్ముకు వుండు దాయిత్వము.

26. ఫర్ము వర్తకపు మామూలు సరళిలో వ్యవహరించుచు లేక తన భాగస్వాముల ప్రాధికారముతో భాగస్వామిచేసిన దోషయుత కార్యము లేక కార్యలోపము ద్వారా ఎవరేని అన్యవ్యక్తికి నష్టము లేదా హాని కలిగినయెడల లేక ఏదేని శాస్తి ఉపగతమైన యెడల, అందుకు భాగస్వామికి బాధ్యత ఉండునంతమేరకు ఫర్ముకు కూడా బాధ్యత ఉండును.

భాగస్వాములు చేయు దుర్వినియోగమునకు ఫర్ముకు ఉండు దాయిత్వము.

27. ఈ క్రింది సందర్భములలో, అనగా—

(ఏ) భాగస్వామి తనకు ఉన్నదనుకొనెడి ప్రాధికారములోపల వ్యవహరించుచు అన్యవ్యక్తినుండి డబ్బు లేక ఆస్తి గ్రైకొని దానిని దుర్వినియోగము చేసినయెడల, లేక

(బీ) ఫర్ము తన వర్తక సరళిలో అన్యవ్యక్తినుండి డబ్బు, లేక ఆస్తి గ్రైకొనగా అది ఫర్ము అభిరక్షలో నున్నప్పుడు దానిని భాగస్వాములలో ఎవరైనను దుర్వినియోగము చేసినయెడల,

ఆ నష్టమును ఫర్ము అచ్చుకొనవలెను.

తెలియపరుచుట.

28. (1) నోటి మాటతో గాని, వ్రాతమూలకముగ గాని చెప్పుటద్వారా లేదా నడవడి ద్వారా ఒక ఫర్ములో తాను భాగస్వామిగనున్నట్లు తెలియపరచు లేక ఎరిగియుండియు

తెలియపరచబడనిచ్చు నతడెవర్సైనను, ఏదేని అట్టి తెలియపరచిన లేక తెలియపరచబడ నిచ్చినదాని భరోసాపై ఆ ఫర్ముకు అప్పుపెట్టిన ఎవరేని వ్యక్తికి, ఆ ఫర్ములోని భాగస్వామి వలెనే బాధ్యుడైయుండును,-భాగస్వామిగనున్నట్లు తెలియపరచినది లేక తెలియపరచబడినది ఆ అప్పుపెట్టిన వ్యక్తికి తెలిసినదని ఆ తెలియపరచిన లేక తెలియపరచ బడనిచ్చిన వ్యక్తి ఎరిగియున్నను, లేకున్నను సరే.

(2) ఒక భాగస్వామి మరణించిన పిమ్మట వర్తకము పాత ఫర్మ పేరుతోనే కొనసాగినయెడల, ఆ పేరును లేక, తద్భాగముగా మృతభాగస్వామి పేరును ఇంకను ఉపయోగించినంత మాత్రమునసే అతని శాసనిక ప్రతినిధికిగాని, అతని సంపదకు గాని అతడు మరణించిన పిమ్మట ఫర్మచే చేయబడిన ఏదేని కార్యమునకు బాధ్యత నాపాదింపదు.

29. (1) భాగస్వామి ఫర్ములోని తన హితమును బేషరతుగా గాని, తాకట్టు ద్వారా గాని, ఆ హితముపై ప్రభారమును సృష్టించుట ద్వారా గాని చేసిన అంతరణ వలన అంతరణస్వీకర్తకు, ఫర్మ కొనసాగు కాలములో, వర్తక నిర్వహణయందు జోక్యము కలిగించుకొనుటకు లేక లెక్కలను చూపుమని కోరుటకు లేక ఫర్మ పుస్తకములను తనిఖీ చేయుటకు హక్కు ఉండదు; కాని అంతరణచేయు భాగస్వామి వాటాకు వచ్చు లాభములను పొందుటకు మాత్రము అంతరణస్వీకర్తకు హక్కు ఉండును, మరియు భాగస్వాములు ఒప్పుకొనిన లాభముల లెక్కలను అంతరణస్వీకర్త అంగీకరించవలెను. భాగస్వామి హితము యొక్క అంతరణస్వీకర్త హక్కులు.

(2) ఫర్మ విఘటితమైనచో లేక అంతరణచేయు భాగస్వామి భాగస్వామిగా ఉండుట ముగిసినచో, ఫర్ముయొక్క సంపత్తులలో ఏ వాటాను పొందుటకు అంతరణ చేయు భాగస్వామికి హక్కు ఉండునో ఆ వాటాను పొందుటకును, ఆ వాటా ఎంతయని నిశ్చయించుకొనుటకై, విఘటితమైన తేదీనుండి లెక్కలు తేల్చుకొనుటకును అంతరణ స్వీకర్తకు మిగతా భాగస్వాములపట్ల హక్కు కలుగును.

30. (1) తనకు వర్తించు శాసనము ప్రకారము మైనరుగా ఉన్న వ్యక్తి ఫర్ములో భాగస్వామికాలేడు, కాని తత్సమయముననున్న భాగస్వాములందరి సమ్మతితో అతనికి భాగస్వామ్యపు మేలు చెందునట్లు అతనిని అందు చేర్చుకొనవచ్చును. భాగస్వామ్యపు మేలుపొందుటకు మైనర్లను చేర్చుకొనుట.

(2) అట్టి మైనరు, ఫర్ముయొక్క ఆస్తిలోను, లాభములలోను కరారు చేసికొనిన ప్రకారము వాటాకు హక్కు కలిగియుండును; మరియు ఫర్ముయొక్క లెక్కలేవైనను అతనికి అందుబాటులో ఉండవలెను, అతడు వాటిని తనిఖీ చేయవచ్చును, వాటి నకలు తీసికొనవచ్చును.

(3) అట్టి మైనరు వాటాపై ఫర్ముయొక్క కార్యములకు బాధ్యత మోపబడి యుండును; కాని, మైనరుకు వ్యక్తిగతముగా ఏదేని అట్టి కార్యమునకు బాధ్యత ఉండదు.

(4) అట్టి మైనరు, ఫర్మతో తన సంబంధమును వదులుకొనునప్పుడు తప్ప, ఫర్ముయొక్క ఆస్తిలోగాని, లాభములలో గాని తన వాటానుగురించి లెక్కలకొరకు లేక చెల్లింపు కొరకు, భాగస్వాములపై దావా వేయరాదు; ఫర్మతో తన సంబంధమును వదులుకొను సందర్భములో అతని వాటాను సాధ్యమైనంతవరకు 48వ పరిచ్ఛేదపు నియమములననుసరించి విలువకట్టి అది యెంతమొత్తమగునో నిర్ధారణ చేయవలెను:

అయితే, భాగస్వాములందరు ఉమ్మడిగ వ్యవహరించుచు గాని, ఇతర భాగస్వాములకు నోటీసు ఇచ్చి ఫర్మను విఘటన చేయుటకు హక్కుగల ఏ భాగస్వామి యైనను గాని, ఫర్మను విఘటితము చేయవలెనని అట్టి దావాలో ఎంచుకొనవచ్చును; అటుపైన న్యాయస్థానము ఆ దావాను విఘటన కొరకును, భాగస్వాముల మధ్య లెక్కల పరిష్కారము కొరకును వేయబడిన దావాయైనట్లు నడపించవచ్చును; మరియు మైనరు వాటా మొత్తమును భాగస్వాముల వాటాలతోపాటు నిర్ధారణ చేయవలెను.

(5) అతడు మేజర్యైన తేదీ లేక తనకు భాగస్వామ్యపు మేలు చెందునట్లు తాను చేర్చుకొనబడితినని అతనికి తెలిసిన తేదీ-ఇందు ఏ తేదీ తరువాతిది అగునో ఆ తేదీనుండి ఆరుమాసముల లోగా ఎప్పుడైనను, తాను ఫర్మ్‌లో భాగస్వామియగుటకు ఎంచుకున్నానని లేక కాకుండుటకు ఎంచుకున్నానని పబ్లిక్‌కు నోటీసు ఈయవచ్చును; అట్టి నోటీసు ఫర్మ్‌కు సంబంధించినంతవరకు అతని స్థితిని నిర్ధారణచేయును:

అయితే, అతడు అట్టి నోటీసును ఈయనిచో సదరు ఆరు మాసములు గడచినప్పుడు అతడు ఫర్మ్‌లో భాగస్వామియగును.

(6) ఎవరేని వ్యక్తి మైనరుగా ఫర్మ్‌లో భాగస్వామ్యపు మేలు అతనికి చెందునట్లు చేర్చుకొనబడినయెడల, అట్టి వ్యక్తి మేజరై ఆరుమాసములు గడచిన పిమ్మట ఫలానా తేదీవరకు అట్లు చేర్చుకొనుటను గూర్చి అతనికి తెలియదను సంగతిని రుజువు చేయు భారము ఆ సంగతిని తెల్పుచున్న వ్యక్తులపై ఉండును.

(7) అట్టి వ్యక్తి భాగస్వామి అయినయెడల,-

(ఏ) మైనరుగా అతనికిగల హక్కులు, దాయిత్వములు అతడు భాగస్వామియగు తేదీవరకు కొనసాగును; కాని, అతడు భాగస్వామ్యపు మేలు తనకు చెందునట్లు చేర్చుకొనబడినప్పటినుండి ఫర్మ్‌యొక్క కార్యములన్నిటికి అన్య వ్యక్తులకు కూడ వ్యక్తిగతముగా బాధ్యుడగును,

(బీ) ఫర్మ్‌యొక్క ఆస్తిలోను, లాభములలోను మైనరుగా అతనికి ఎంత వాటాకు హక్కు ఉండెనో, అంతే వాటా అతనికి ఉండును.

(8) అట్టి వ్యక్తి భాగస్వామిగా నుండకుండుటకు ఎంచుకొనినయెడల,-

(ఏ) అతడు పబ్లిక్‌కు నోటీసు ఇచ్చు తేదీవరకు అతని హక్కులు, దాయిత్వములు మైనరుకు ఈ పరిచ్ఛేదము క్రింద ఉండు హక్కులు, దాయిత్వములుగానే కొనసాగును,

(బీ) నోటీసు ఇచ్చిన తేదీకి పిమ్మట ఫర్మ్‌చేసిన ఏ కార్యములకైనను అతని వాటాకు బాధ్యతఉండదు,

(సీ) ఉప-పరిచ్ఛేదము (4) ననుసరించి ఆస్తిలోను, లాభములలోను తన వాటా కొరకై భాగస్వాములపై దావావేయుటకు అతనికి హక్కు ఉండును.

(9) ఉపపరిచ్ఛేదము (7) మరియు (8) లోనిదేదియు 28వ పరిచ్ఛేదము యొక్క నిబంధనలకు భంగము కలిగించదు.

## అధ్యాయము - 5

## ప్రవేశించు మరియు నిష్క్రమించు భాగస్వాములు.

భాగస్వామిని చేర్చుకొనుట.

31. (1) భాగస్వాముల మధ్యగల కాంట్రాక్టుకును, 30వ పరిచ్ఛేదపు నిబంధనలకును లోబడి ఏ వ్యక్తినైనను, భాగస్వాములుగా అప్పుడు ఉన్నవారందరి సమ్మతి లేకుండ, ఫర్మ్‌లో భాగస్వామిగా చేర్చుకొనరాదు.

(2) 30వ పరిచ్ఛేదము యొక్క నిబంధనలకు లోబడి, ఫర్మ్‌లో భాగస్వామిగా చేర్చుకొనబడినట్టి వ్యక్తి, అంతమాత్రముననే తాను భాగస్వామియగుటకు పూర్వము ఫర్మ్‌చేసిన ఏ కార్యమునకైనను బాధ్యుడు కాడు.

భాగస్వామిగా విరమణ.

32. (1) ఒక భాగస్వామి-

(ఏ) ఇతర భాగస్వాములందరి సమ్మతితో,

(బీ) భాగస్వాములచే చేసికొనబడిన అభివ్యక్త కరారు ననుసరించి, లేక

(సీ) భాగస్వామ్యము యథేచ్ఛా-భాగస్వామ్యమైనయెడల, ఇతర భాగస్వాము లందరికి, తాను విరమించదలచిన ఉద్దేశమును గూర్చి వ్రాతమూలకముగా నోటీసు ఇచ్చి-

విరమించవచ్చును.

(2) విరమించు భాగస్వామి, తాను ఎవరేని అన్యవ్యక్తితోను, పునస్సంఘటిత మైన ఫర్మయొక్క భాగస్వాములతోను చేసికొనిన కరారుద్వారా తన విరమణకు పూర్వము ఫర్మచేసిన కార్యములకు ఏదేని దాయిత్వము నుండి ఆ అన్య వ్యక్తికి సంబంధించి ఉన్మోచన పొందవచ్చును. విరమణనుగూర్చి ఆ అన్య వ్యక్తికి తెలిసిన పిమ్మట, అతనికిని, పునస్సంఘటితమైన ఫర్మకును మధ్య నడచిన వ్యవహార సరళినిబట్టి గర్భితమైన కరారుగలదని తలచవచ్చును.

(3) ఫర్మనుండి భాగస్వామి విరమించినప్పటికిని, విరమణను గూర్చి పబ్లికు నోటీసు ఈయబడునంతవరకు, అతడును, భాగస్వాములును విరమణకు పూర్వము వారిలో ఎవరిచేనైనను ఏ కార్యము చేయబడియుండినచో అది ఫర్మయొక్క కార్యమై యుండెడిదో ఆ కార్యమునకు భాగస్వాములుగా అన్య వ్యక్తులపట్ల బాధ్యులై యుండుట కొనసాగును:

అయితే, విరమించిన భాగస్వామి ఒక భాగస్వామిగా ఉండెనని ఎరుగక, ఫర్మతో వ్యవహారము చేసిన ఎవరేని అన్యవ్యక్తికి విరమించిన భాగస్వామి బాధ్యుడై యుండడు.

(4) ఉపపరిచ్ఛేదము (3) క్రింద నోటీసులను, విరమించిన భాగస్వామిగాని, పునస్సంఘటిత ఫర్మయొక్క ఎవరేని భాగస్వామిగాని ఈయవచ్చును.

33. (1) భాగస్వాముల మధ్యగల కాంట్రాక్టుద్వారా ఒసగబడిన అధికారములను సద్భావముతో వినియోగించుట ద్వారా తప్ప, అధిక సంఖ్యాక భాగస్వాములు ఎంత మందియైనను ఒక భాగస్వామిని ఫర్మనుండి బహిష్కరించరాదు. భాగస్వామి బహిష్కరణ.

(2) 32వ పరిచ్ఛేదము యొక్క ఉపపరిచ్ఛేదములు (2), (3) మరియు (4)ల యొక్క నిబంధనలు, బహిష్కరించబడిన భాగస్వామికి, అతడు విరమణచేసిన భాగస్వామి యైన ఎట్లో అట్లే వర్తించును.

34. (1) ఫర్మలోని భాగస్వామి దివాలాతీసెనని న్యాయ నిర్ణయము చేయబడిన యెడల, ఫర్మ తద్ద్వారా విఘటితమైనను కాకున్నను, ఆ న్యాయనిర్ణయపు ఉత్తరువు ఈయబడిన తేదీన అతడు భాగస్వామిగా ఉండుట ముగియును. భాగస్వామి దివాలా తీయుట.

(2) భాగస్వాముల మధ్యగల కాంట్రాక్టుక్రింద, భాగస్వామి దివాలా తీసెనని చేయబడిన న్యాయనిర్ణయమునుబట్టి ఫర్మ విఘటితము కానియెడల, అట్లు న్యాయ నిర్ణీతుడైన భాగస్వామియొక్క సంపదపై, న్యాయనిర్ణయపు ఉత్తరువు ఈయబడిన తేదీకి పిమ్మట ఫర్మచేసిన ఏ కార్యమునకైనను, బాధ్యత మోపబడదు; ఆ తేదీకి పిమ్మట దివాలాదారు చేసిన ఏ కార్యమునకైనను ఫర్మకు బాధ్యత ఉండదు.

35. భాగస్వాముల మధ్యగల కాంట్రాక్టుక్రింద, భాగస్వామి మరణమువలన ఫర్మ విఘటితము కానియెడల, అతడు మరణించిన తరువాత ఫర్మచేసిన ఏ కార్యమున కైనను మృత భాగస్వామి సంపదపై బాధ్యత మోపబడదు. మృతభాగస్వామి సంపదపై వుండు దాయిత్వము.

నిష్క్రమించిన భాగస్వామి పోటీ వర్తకమును సాగించుటకు హక్కు

36. (1) ఫర్ము వర్తకమునకు పోటీగా యుండు వర్తకమును నిష్క్రమించిన భాగస్వామి సాగించవచ్చును; అతడు అట్టి వర్తకమును గురించి వ్యాపార ప్రకటన ఈయవచ్చును. - కానీ, తద్విరుద్ధముగా ఉండు కాంట్రాక్టునకు లోబడి, అతడు—

(ఏ) ఫర్ము పేరును ఉపయోగింపరాదు,

(బీ) ఫర్ముయొక్క వర్తకమును తాను చేయుచున్నట్లు తెలియపరచరాదు, లేక

(సీ) అతడు భాగస్వామిగా ఉండుట ముగియుటకు పూర్వము ఏ వ్యక్తులకు ఫర్ముతో లావాదేవీలు ఉండెడివో వారిని తనతో లావాదేవీలు పెట్టుకొనుడని అభ్యర్థింపరాదు.

వ్యాపార అవరోధ కరారులు.

(2) ఒక భాగస్వామి, తాను భాగస్వామిగా ఉండుట ముగిసినపుడు, ఫర్ముచేయు వర్తకమువంటి ఏ వర్తకమునైనను నిర్దిష్ట కాలావధిలో, లేక నిర్దిష్ట స్థానిక హద్దులలో చేయనని తన సహభాగస్వాములతో కరారు చేసికొనవచ్చును; భారత

1872 లోని 9వ చట్టము.

కాంట్రాక్టు చట్టము, 1872 యొక్క 27వ పరిచ్ఛేదములో ఏమి యున్నప్పటికిని, అట్టి కరారు, తద్వారా విధింపబడిన నిర్బంధనలు యుక్తమైనవైనచో శాసనమాన్యమైనదై యుండును.

కొన్ని సందర్భములలో, నిష్క్రమించు భాగస్వామి ఆ తరువాతి లాభములలో వాటాను పొందు హక్కు.

37. ఫర్ముయొక్క సభ్యుడు ఎవరైనను మరణించినయెడల, లేక అన్యథా అతడు భాగస్వామిగా ఉండుట ముగిసినయెడల, మరియు ఉత్తరజీవులైన లేక కొనసాగుచున్న భాగస్వాములు తమకును నిష్క్రమించు భాగస్వామికిని మధ్యగల లేక తమకును అతని సంపదకును మధ్యగల లెక్కలను అంతిమముగ పరిష్కరించుకొనకయే, ఫర్ముయొక్క ఆస్తితో ఫర్ముయొక్క వర్తకమును సాగించినయెడల, ఆ నిష్క్రమించిన భాగస్వామి యొక్క లేక అతని ప్రతినిధులయొక్క అభిమతమునుబట్టి, అతడు భాగస్వామిగా ఉండుట ముగిసినప్పటినుండి వచ్చిన లాభములలో ఎంత మొత్తము ఫర్ముయొక్క ఆస్తిలోని అతని వాటాను ఉపయోగించుట వలన వచ్చినదని చెప్పవచ్చునో అంతయైనను, ఫర్ముయొక్క ఆస్తిలో అతని వాటా మొత్తముపై సాలీనా ఆరు శాతము రేటు చొప్పున వడ్డీయైనను పొందుటకు, నిష్క్రమించిన భాగస్వామికిగాని అతని సంపదకుగాని, తద్విరుద్ధముగా కాంట్రాక్టు లేనప్పుడు, హక్కు ఉండును:

అయితే, భాగస్వాములమధ్యగల కాంట్రాక్టుద్వారా, మృత భాగస్వామియొక్క లేక నిష్క్రమించు భాగస్వామి యొక్క హితమును ఉత్తరజీవులైన లేక కొనసాగుచున్న భాగస్వాములకు వారి అభిమతమునుబట్టి, కొనుగోలుచేయుటకు వీలుఉండి, అట్లుచేయుట వారి అభిమతమనివారు తగురీతిగా తెల్పినపుడు సందర్భానుసారముగ, మృత భాగస్వామి యొక్క సంపదకు గాని, నిష్క్రమించు భాగస్వామికి లేక అతని సంపదకు గాని, లాభములలో అదనపు లేక ఇతర వాటాను పొందు హక్కు ఉండదు. కానీ, ఆ అభిమతమునుబట్టి వ్యవహరించుటకు పూనుకొనిన భాగస్వామి ఎవరైనను దానికి సంబంధించిన నిబంధనలను ముఖ్య విషయములన్నింటిలో పాటించనిచో, అతడు ఈ పరిచ్ఛేదములోని పై నిబంధనలక్రింద లెక్క చెప్పవలసియుండును.

ఫర్ములో సంభవించిన మార్పునుబట్టి నిరంతర గ్యారంటీ ఉపసంహరింపబడుట.

38. ఫర్ముకుగాని, ఫర్ముయొక్క వ్యవహారముల విషయములో అన్య వ్యక్తికిగాని నిరంతర గ్యారంటీ ఈయబడినచో, తద్విరుద్ధముగా కరారు లేనప్పుడు, ఫర్ముయొక్క సంఘటనములో ఏదేని మార్పు జరిగిన తేదీనుండి ఆ తరువాతి వ్యవహారములకు సంబంధించి ఆ గ్యారంటీ ఉపసంహరించబడినదగును.

## అధ్యాయము - 6

### ఫర్ముయొక్క విఘటన

ఫర్ము యొక్క విఘటన.

39. ఫర్ముయొక్క భాగస్వాములందరి మధ్య భాగస్వామ్యము విఘటనయగుట "ఫర్ముయొక్క విఘటన " అని పేర్కొనబడును.

౪౦. ఫర్మ్, భాగస్వాములందరి సమ్మతితోగాని, ఆ భాగస్వాముల మధ్యగల కాంట్రాక్టు ననుసరించి గాని విఘటితము కావచ్చును. కరారు ద్వారా విఘటన.

41. ఈ క్రింది విధముగా, అనగా— నిర్బంధ విఘటన.

(ఏ) భాగస్వాములందరు గాని, వారిలో ఒకరు తప్ప తక్కిన వారందరుగాని దివాలా తీసినట్లు న్యాయనిర్ణయము చేయబడినట్లయితే, లేక;

(బీ) ఏదేని సంఘటన జరిగి తద్వారా ఫర్మ్‌యొక్క వర్తకమును సాగించుట గాని, భాగస్వాములు దానిని భాగస్వామ్యముతో సాగించుటగాని శాసనసమ్మతిని గోల్పోయినట్లయితే,

ఫర్మ్ విఘటితమగును:

అయితే, ఫర్మ్ ఒకటికి మించి విడివిడిగా వ్యాపారకృత్యములను లేక వ్యాపార కార్యకలాపములను సాగించుచున్నయెడల, అందు ఒకటి శాసనవిరుద్ధమైనది లేదా కొన్ని శాసనవిరుద్ధమైనవి అయినంత మాత్రముననే ఫర్మ్‌యొక్క శాసనసమ్మతమైన వ్యాపార కృత్యముల మరియు వ్యాపార కార్యకలాపముల విషయమున ఫర్మ్ విఘటితము కాదు.

42. భాగస్వాముల మధ్యగల కాంట్రాక్టుకు లోబడి,— కొన్ని సంఘటనలు జరిగినపుడు విఘటన

(ఏ) నియత కాలావధికై ఫర్మ్ సంఘటితము చేయబడినచో, ఆ కాలావధి ముగిసినట్లయితే;

(బీ) ఒకటి లేక అంతకుమించిన వ్యాపార కృత్యములను లేదా వ్యాపార కార్యకలాపములను నిర్వహించుటకు ఫర్మ్ సంఘటితము చేయబడినచో, అది లేక అవి పూర్తిఅయినట్లయితే;

(సీ) భాగస్వామి మరణించినట్లయితే; మరియు

(డీ) భాగస్వామి దివాలా తీసెనని న్యాయనిర్ణయము చేయబడినట్లయితే,

ఫర్మ్ విఘటితమగును.

43. (1) భాగస్వామ్యము యథేచ్ఛా-భాగస్వామ్యమైన యెడల, ఫర్మ్‌లోని భాగస్వాములలో ఎవరైనను, ఫర్మ్‌ను విఘటితము చేయవలెనను తన ఉద్దేశమును గూర్చి ఇతర భాగస్వాములందరికి వ్రాతమూలకమైన నోటీసు ఇచ్చుట ద్వారా ఫర్మ్‌ను విఘటితము చేయవచ్చును. నోటీసు ద్వారా యథేచ్ఛా-భాగస్వామ్యము యొక్క విఘటన.

(2) ఫర్మ్ విఘటన కావలసిన తేదీగా నోటీసులో పేర్కొనబడిన తేదీనుండి, లేక అట్టి తేదీని దేనిని పేర్కొననిచో, నోటీసు అందజేయబడిన తేదీనుండి ఫర్మ్ విఘటిత మగును.

44. భాగస్వామియొక్క దావాపై న్యాయస్థానము ఈ క్రింది ఆధారములలో దేనిపైనగాని ఫర్మ్‌ను విఘటితము చేయవచ్చును, అవేవనగా:— న్యాయస్థానము ద్వారా విఘటన.

(ఏ) ఒక భాగస్వామి మతిస్థిమితము లేనివాడగుట; అట్టి సందర్భములో మతిస్థిమితము లేనివాడైపోయిన భాగస్వామియొక్క దావా మిత్రుడైనను, ఏ ఇతర భాగస్వామియైనను దావా వేయవచ్చును;

(బీ) దావావేయు భాగస్వామి కాక ఇతర భాగస్వామి ఎవరైనను తన కర్తవ్యము లను నిర్వర్తించుటకు శాశ్వతముగ అసమర్థుడగుట;

(సి) ఫర్ముయొక్క వర్తక స్వభావము దృష్ట్యా, దావావేయు భాగస్వామికాక ఇతర భాగస్వామి ఎవరైనను, వర్తకమునకు భంగమువాటిల్లునట్లు ప్రవర్తించుచుండుట;

(డి) దావావేయు భాగస్వామికాక ఇతర భాగస్వామి ఎవరైనను, బుద్ధిపూర్వకముగగాని, మాటిమాటికిగాని ఫర్ము కార్యకలాపముల నిర్వహణకు లేదా వర్తకమునకు సంబంధించిన కరారులను పాటించకుండుట లేక వర్తకమునకు సంబంధించిన విషయములలో అతనితో భాగస్వాములుగా కలిసి వర్తకమును సాగించుట ఇతర భాగస్వాములకు ఆచరణ సాధ్యము కాకుండునట్లుగ ప్రవర్తించుచుండుట;

1908 లోని 5వ చట్టము

(ఈ) దావావేయు భాగస్వామికాక ఇతర భాగస్వామి ఎవరైనను, అన్య వ్యక్తికి ఫర్మునందలి తన వాతమును ఏదో విధముగా పూర్తిగా అంతరణచేసియుండుట, లేక సివిలు ప్రక్రియా స్మృతి, 1908 లోని మొదటి అనుసూచియొక్క ఉత్తరువు 21 లోని నియమము 49 యొక్క నిబంధనల క్రింద తనవాటాపై ప్రభారము మోపనిచ్చుట లేక ఆ భాగస్వామి చెల్లించవలసియున్న భూమి శిస్తు బకాయీల యొక్క లేదా భూమి శిస్తు బకాయిలుగా వసూలు చేయదగిన ఏవేని బాకీల యొక్క వసూలు చర్యలలో తన వాటాను విక్రయింపబడనిచ్చుట;

(ఎఫ్) ఫర్ముయొక్క వర్తకమును నష్టముపై తప్ప సాగింపరాకుండుట;

(జీ) ఫర్మును విఘటితము చేయుటకు న్యాయోచితమైన, ధర్మబద్ధమైన ఏదేని ఇతర ఆధారము ఉండుట.

విఘటన చేయబడిన పిమ్మట భాగస్వాములు చేసిన కార్యములకు దాయిత్వము.

45. (1) ఫర్ము విఘటన చేయబడినప్పటికిని, విఘటనను గూర్చి పబ్లికు నోటీసు ఈయబడునంతవరకు భాగస్వాములు, విఘటనకు పూర్వము వారిలో ఎవరిచే నైనను ఏ కార్యము చేయబడియుండినచో అది ఫర్ముయొక్క కార్యమైయుండెడిదో ఆ కార్యమునకు అట్టి భాగస్వాములుగా అన్య వ్యక్తులపట్ల బాధ్యులైయుండుట కొనసాగును:

అయితే, మరణించిన లేక దివాలాతీసినట్లు న్యాయనిర్ణయము చేయబడిన భాగస్వామియొక్క సంపదపై, లేదా ఒక భాగస్వామిగా ఉండెనని ఫర్ముతో వ్యవహరించిన వ్యక్తికి తెలియనట్టియు, ఫర్మునుండి విరమించునట్టియు భాగస్వామి యొక్క సంపదపై, అతడు భాగస్వామిగా నుండుట ముగిసిన తేదీకి తరువాత చేయబడిన కార్యముల విషయమున ఈ పరిచ్ఛేదము క్రింద బాధ్యతమోపబడదు.

(2) ఉపపరిచ్ఛేదము (1) క్రింద నోటీసులను ఏ భాగస్వామియైనను ఈయ వచ్చును.

విఘటన చేయబడిన పిమ్మట వర్తకమును పరిసమాపనము చేయుటకు భాగస్వాముల హక్కు.

46. ఫర్ము విఘటితము చేయబడినపుడు, ఫర్ము ఆస్తిని, ఫర్ముయొక్క ఋణములను, దాయిత్వములను తీర్చుటకై వినియోగించుటకును, అందలి మిగులును భాగస్వాముల లేక వారి ప్రతినిధుల హక్కులననుసరించి వారిమధ్య పంపిణీచేయుటకును ప్రతియొక భాగస్వామికి లేక అతని ప్రతినిధికి ఇతర భాగస్వాములందరిపట్ల లేక వారి ప్రతినిధులపట్ల హక్కుకలుగును.

పరిసమాపనము నిమిత్తము భాగస్వాముల నిరంతర ప్రాధికారము.

47. ఫర్మును బద్ధము చేయుటకు ప్రతియొక్క భాగస్వామికి గల ప్రాధికారము మరియు భాగస్వాముల యొక్క ఇతర పారస్పరిక హక్కులు, బాధ్యతలు—ఫర్ము విఘటనచేయబడినప్పటికిని, ఫర్ముయొక్క కార్యకలాపములను పరిసమాపనము చేయుటకును, ప్రారంభింపబడియుండి, విఘటితముచేయు సమయమున పూర్తిచేయబడకుండ ఉన్న వ్యవహారములను పూర్తిచేయుటకును ఆవశ్యకమైనంతమేరకు మాత్రమే ఫర్ము విఘటితమైన మీదట–కొనసాగును:

అయితే, దివాలాదారని న్యాయనిర్ణయము చేయబడిన భాగస్వామియొక్క కార్యముల వలన ఎట్టి సందర్భములోను ఫర్ము బద్ధముకాదు; కాని అట్లు న్యాయనిర్ణయము

వేయబడిన పిమ్మట, తాను దివాలాదారు యొక్క భాగస్వామినని తెలియపరచిన లేక ఎరిగియుండియు, తెలియపరచబడనిచ్చిన ఏ వ్యక్తికైనను ఉండు దాయిత్వమునకు ఈ వినాయింపు భంగము కలిగించదు.

భాగస్వాముల మధ్య లెక్కలను పరిష్కారము చేయు పద్ధతి.

48. విఘటన చేయబడిన పిమ్మట ఫర్మ లెక్కలను పరిష్కరించుటలో భాగస్వాములు చేసికొనిన కరారుకు లోబడి, ఈ క్రింది నియమములను పాటించవలెను:-

(ఏ) మూలధనపు లోటుతోసహా నష్టములను, మొదట లాభములనుండి, తరువాత మూలధనమునుండి, చివరకు, అవశ్యకమైనచో భాగస్వాములు ఏ అనుపాతములో లాభములను పంచుకొను హక్కు కలిగియుందురో ఆ అనుపాతములో వారు వ్యక్తిగతముగా చెల్లించవలెను;

(బీ) మూలధనపు లోటును పూరించుటకు భాగస్వాములు ఇచ్చిన ఏవేని మొత్తములతోసహా, ఫర్మయొక్క సంపత్తులను ఈ క్రింది రీతిగాను, క్రింది క్రమములోను, అనగా-

(i) అన్యవ్యక్తులకు ఫర్మ బాకీ ఉన్న ఋణములను చెల్లించుటలోను;

(ii) మూలధనము కానట్టి అడ్వాన్సులు ఇచ్చిన భాగస్వాములలో వారివారికి ఫర్మ నుండి రావలసిన దానిని దామాషాగా చెల్లించుటలోను;

(iii) మూలధనము బాబతున ప్రతియొక భాగస్వామికి రావలసినదానిని దామాషాగా చెల్లించుటలోను,

వినియోగించవలెను; మరియు

(iv) మిగులు ఏదేని ఉన్నచో దానిని భాగస్వాముల మధ్య, ఏ అనుపాతములో లాభములను పంచుకొనుటకు వారికి హక్కు ఉండునో ఆ అనుపాతములో పంచవలెను.

ఫర్మ ఋణముల మరియు విడివిడి ఋణముల చెల్లింపు.

49. ఫర్మ చెల్లించవలసిన సంయుక్త ఋణములు మరియు ఎవరేని భాగస్వామి చెల్లించవలసిన అతడి విడి ఋణములు కూడ ఉన్నయెడల, ఫర్మయొక్క ఆస్తిని మొట్ట మొదట ఫర్మయొక్క ఋణములను చెల్లించుటలో వినియోగించవలెను; ఏదేని మిగులు ఉన్నచో, అందు ప్రతియొక భాగస్వామి వాటాను అతని విడి ఋణములను చెల్లించుటలో వినియోగించవలెను లేక అతనికి చెల్లించవలెను. ఎవరేని భాగస్వామియొక్క విడి ఆస్తిని మొదట, అతని విడి ఋణములను చెల్లించుటలో వినియోగించి, మిగులు ఏదేని ఉన్నచో, దానిని ఫర్మయొక్క ఋణములను చెల్లించుటలో వినియోగించవలెను.

విఘటితమైన పిమ్మట గడించిన సొంత లాభములు.

50. భాగస్వామి మరణించినందువలన ఫర్మ విఘటితము చేయబడిన పిమ్మటను, దాని కార్యకలాపములు పూర్తిగా పరిసమాప్తము చేయబడక పూర్వమును, ఎవరేని ఉత్తరజీవియైన భాగస్వామి లేక మృత భాగస్వామియొక్క ప్రతినిధులు పూనుకొనిన వ్యవహారములకు, భాగస్వాముల మధ్యగల కాంట్రాక్టుకు లోబడి, 16వ పరిచ్ఛేదము యొక్క ఖండము (ఏ) లోని నిబంధనలు వర్తించును:

అయితే, ఎవరేని భాగస్వామి, లేక అతని ప్రతినిధి ఫర్మయొక్క వ్యాపార ఖ్యాతిని (గుడ్‌విల్‌ను) కొనుగోలుచేసినచో ఈ పరిచ్ఛేదములోనిదేదియు, ఫర్మ పేరును ఉపయోగించుటకు అతనికిగల హక్కుకు భంగము కలిగించదు.

నియతకాలమునకు పూర్వమే విఘటన జరుగగా ప్రీమియమును వాపసు పొందుట.

51. భాగస్వామి, భాగస్వామ్యములో చేరునపుడు నియత కాలావధి వరకు ప్రీమియమును చెల్లించియుండి, భాగస్వాములలో ఒకరి మరణమువలన కాక, ఇతర కారణమువలన ఆ అవధి ముగియుటకు పూర్వమే ఫర్మ విఘటితమైనయెడల, అతడు భాగస్వామి అగుటకు సంబంధించిన నిబంధనలను, అతడు భాగస్వామిగా ఉన్న కాలావధిని దృష్టియందుంచుకొని, ఆ ప్రీమియమును గాని అందు యుక్తమైన కొంతభాగమును గాని,

(ఏ) విఘటన జరుగుటకు అతని దుష్ప్రవర్తన ముఖ్య కారణముగా ఉండిననే తప్ప, లేక

(బీ) ప్రీమియమును లేక అందు కొంత భాగమును వాపసు చెల్లించవలెనను నిబంధన ఏదియు లేని కరారును పురస్కరించుకొని విఘటన జరిగిననే తప్ప,

వాపసు పొందుటకు అతనికి హక్కు ఉండును.

కపటము, లేక అసత్యకథనము కారణముగా భాగస్వామ్యపు కాంట్రాక్టు రద్దు చేయబడినప్పుడు హక్కులు.

52. భాగస్వామ్యమును ఏర్పాటుచేయు కాంట్రాక్టు, దానికి చెందిన పక్షకారులలో ఎవరి కపటము, లేక అసత్యకథనము ఆధారముపైనైనను రద్దుచేయబడిన యెడల, రద్దుచేయుటకు హక్కుగల పక్షకారుకు, అతని ఏదేని ఇతర హక్కుకు భంగము లేకుండ-

(ఏ) ఫర్మునలో వాటాను కొనుగోలు చేయుటకై అతడు చెల్లించిన ఏదేని మొత్తము కొరకును, అతనిచే ఈయబడిన ఏదేని మూలధనము కొరకును, ఫర్ము యొక్క ఋణములు చెల్లింపబడిన పిమ్మట ఉండు మిగులుపై లేక ఫర్ముకు మిగిలిన సంపత్తులపై ధారణాధికారము గాని, నిలిపిఉంచు హక్కు గాని ఉండును;

(బీ) ఫర్ముయొక్క ఋణముల తీరుదలకు అతడు చేసిన ఏదేని చెల్లింపు విషయములో ఫర్ముయొక్క ఋణదాతస్థాయి కలిగియుండుటకు హక్కు ఉండును; మరియు

(సీ) ఫర్ముయొక్క ఋణములన్నిటి విషయమున కపటముగా ప్రవర్తించిన లేక అసత్యకథనము చేసిన భాగస్వామి నుండి లేక భాగస్వాముల నుండి నష్టపూర్తి పొందుటకు హక్కు ఉండును.

ఫర్ము పేరును లేక ఫర్ము ఆస్తిని ఉపయోగించుటను అవరోధించు హక్కు.

53. ఫర్ము విఘటితము చేయబడిన పిమ్మట, భాగస్వాముల మధ్య తద్విరుద్ధమైన కాంట్రాక్టు లేనప్పుడు, ప్రతియొక భాగస్వామి, లేక అతని ప్రతినిధి ఫర్ముయొక్క కార్యకలాపములు పూర్తిగా పరిసమాపనము చేయబడునంతవరకు, ఎవ్వరేని ఇతర భాగస్వామిని లేక అతని ప్రతినిధిని, ఫర్ముపేరుతో అటువంటి వర్తకమును కొనసాగించ కుండునట్లు, లేక ఫర్ము ఆస్తిలో దేనినైనను తన స్వప్రయోజనమునకై ఉపయోగించ కుండునట్లు అవరోధించవచ్చును:

అయితే, ఎవరేని భాగస్వామి, లేక అతని ప్రతినిధి, ఫర్ముయొక్క వ్యాపార ఖ్యాతిని (గుడ్‌విల్‌ను) కొనుగోలు చేసినయెడల, ఫర్ము పేరును ఉపయోగించుకొనుటకై అతనికి ఉండు హక్కుకు ఈ పరిచ్ఛేదములోనిదేదియు భంగము కలిగించదు.

వ్యాపార అవరోధ కరారులు.

54. భాగస్వాములు ఫర్ము విఘటన చేయబడినపుడు, లేక విఘటన జరుగునని ముందుగనే తలచినపుడు, వారిలో కొందరుగాని వారందరుగాని ఫర్ముచేయు వర్తకము వంటి వర్తకమును నిర్దిష్ట కాలావధిలో లేక నిర్దిష్ట స్థానిక హద్దులలో చేయరాదని కరారు చేసికొనవచ్చును; భారత కాంట్రాక్టు చట్టము, 1872 లోని 27వ పరిచ్ఛేదములో ఏమియున్నప్పటికిని, అట్టి కరారు, తద్వారా విధింపబడిన నిర్బంధనలు యుక్తమైనవైనచో, శాసనమాన్యమైనదైయుండును.

1872 లోని 9వ చట్టము.

విఘటనకు పిమ్మట వ్యాపార ఖ్యాతిని (గుడ్‌విల్‌ను) విక్రయించుట

55. (1) విఘటనకు పిమ్మట ఫర్ము లెక్కలను పరిష్కరించుటలో, భాగస్వాముల మధ్యగల కాంట్రాక్టుకు లోబడి, వ్యాపార ఖ్యాతి (గుడ్‌విల్) సంపత్తులలో చేర్చబడ వలెను; దానిని విడిగా గాని, ఫర్ముయొక్క ఇతర ఆస్తితోపాటుగాని విక్రయించవచ్చును.

వ్యాపార ఖ్యాతి (గుడ్‌విల్) యొక్క కొనుగోలు దారుకును, విక్రయదారుకును ఉండు హక్కులు.

(2) ఫర్ముయొక్క వ్యాపార ఖ్యాతి (గుడ్‌విల్) ఫర్ము విఘటన చేయబడిన పిమ్మట విక్రయింపబడినయెడల, భాగస్వామి ఎవరైనను కొనుగోలుదారు యొక్క వర్తకమునకు పోటీగా ఉండు వర్తకమును సాగించవచ్చును; అతడు అట్టి వర్తకమును గురించి వ్యాపార ప్రకటనచేయవచ్చును; కాని, తనకును ఆ కొనుగోలుదారుకును మధ్యగల కరారుకు లోబడి అతడు-

(ఏ) ఫర్మ పేరును ఉపయోగించరాదు.

(బీ) ఫర్మయొక్క వర్తకమును తాను చేయుచున్నట్లు తెలియపరచరాదు. లేక

(సీ) ఫర్మ విఘటన చేయబడుటకు పూర్వము, ఏ వ్యక్తులకు ఫర్మతో లావాదేవీలు ఉండెడివో వారిని తనతో లావాదేవీలు పెట్టుకొనుడని అభ్యర్థించరాదు.

(3) ఏ భాగస్వామియైనను, ఫర్మయొక్క వ్యాపార ఖ్యాతి (గుడ్‌విల్) విక్రయింపబడినపుడు, ఫర్మచేయు వర్తకము వంటి వర్తకమును నిర్దిష్ట కాలావధిలో లేక నిర్దిష్ట స్థానిక హద్దులలో తాను చేయననీ, ఆ కొనుగోలుదారుతో కరారు చేసికొనవచ్చును; భారత కాంట్రాక్టుల చట్టము, 1872 లోని 27వ పరిచ్ఛేదములో ఏమి యున్నప్పటికినీ, అట్టి కరారు తద్వారా విధింపబడిన నిర్బంధనలు యుక్తమైనవైనచో శాసనమాన్యమైనదై యుండును. వ్యాపార అవరోధ కరారులు. 1872 లోని 9వ చట్టము.

## అధ్యాయము - 7

### ఫర్మల రిజిస్ట్రీకరణ

56. ఏ రాజ్యము యొక్క రాజ్య ప్రభుత్వమైనను, రాజపత్రములో అధిసూచన ద్వారా, ఈ అధ్యాయపు నిబంధనలు ఆ రాజ్యమునకు లేక అధిసూచనలో నిర్దిష్ట పరచు ఏదేని తద్భాగమునకు వర్తింపవని ఆదేశించవచ్చును. ఈ అధ్యాయము యొక్క వర్తింపు నుండి మినహాయించుటకు అధికారము.

57. (1) రాజ్య ప్రభుత్వము ఈ చట్టము నిమిత్తము ఫర్మల రిజిస్ట్రారులను నియమించవచ్చును; వారు ఏ ప్రాంతములలో తమ అధికారములను వినియోగించవలెనో, తమ కర్తవ్యములను నిర్వర్తించవలెనో విశదపరచవచ్చును. రిజిస్ట్రారుల నియామకము.

(2) ప్రతియొక రిజిస్ట్రారు, భారత శిక్షాస్మృతి యొక్క 21వ పరిచ్ఛేద భావములో పబ్లిక్ సేవకుడైనట్లు భావించబడవలెను. 1860 లోని 45వ చట్టము.

58. (1) ఏ ప్రాంతములో ఫర్మయొక్క వర్తక స్థలము కలదో లేక ఏ స్థలములో వర్తకము చేయుటకు ప్రతిపాదించబడినదో ఆ ప్రాంతపు రిజిస్ట్రారుకు— రిజిస్ట్రీకరణకై దరఖాస్తు.

(ఏ) ఫర్మ పేరును,

(బీ) ఫర్మయొక్క వర్తకపు స్థలమును లేక ప్రధాన స్థలమును,

(సీ) ఫర్మ వర్తకము చేయు ఏవేని ఇతర స్థలముల పేర్లను,

(డీ) ఒక్కొక్క భాగస్వామి ఫర్మలో చేరిన తేదీని,

(ఈ) భాగస్వాముల పూర్తి పేర్లను, వారి స్థిర చిరునామాలను,

(ఎఫ్) ఫర్మ కొనసాగెడు కాలావధిని-తెలుపుచు విహిత ప్రరూపములోను, విహిత ఫీజుతోపాటు ఒక వివరణను అందజేయుట ద్వారా గాని, తపాలా ద్వారా పంపుట ద్వారా గాని ఎప్పుడైనను ఫర్మను రిజిస్టరు చేయవచ్చును.

ఆ వివరణపై భాగస్వాములందరు గాని, ఈ విషయమున ప్రత్యేకముగా వారి ప్రాధికారము పొందిన వారి ఏజెంట్లుగాని సంతకము చేయవలెను.

(2) ఆ వివరణపై సంతకము చేయు ప్రతియొక వ్యక్తి విహిత రీతిలో దాని సత్యాపనకూడ చేయవలెను.

(3) ఫర్మ్ పేరులో ఈ క్రింది పదములలో ఏదియు ఉండరాదు. అవి ఏవనగా:--

"క్రౌను", "ఎంపరర్", "ఎంప్రెస్", "ఎంపైర్", "ఇంపీరియల్", "కింగు", "క్వీను", "రాయల్" లేక రాజ్య ప్రభుత్వము వ్రాతమూలకమైన ఉత్తరువు ద్వారా, ఫర్ముయొక్క భాగముగా అట్టి పదములను ఉపయోగించుటకు తమ సమ్మతిని తెలిపినప్పుడు తప్ప, ప్రభుత్వము యొక్క మంజూరీగాని, అనుమోదముగాని, పోషకము గాన కలదని అభివ్యక్తముగా లేదా గర్భితముగా తెలియజేయు ఏవేని పదములు.

*రిజిస్ట్రీకరణ.*

59. 58వ పరిచ్ఛేదము యొక్క నిబంధనలు తగురీతిగా పాటింపబడినవని రిజిస్ట్రారుకు రూఢియైనపుడు, అతడు ఫర్ముల రిజిస్టరు అనబడు రిజిస్టరులో ఆ వివరణను నమోదుచేసి ఫైలుచేయవలెను.

*ఫర్మ్ పేరులోను వర్తకపు ప్రధాన స్థలములోను కలుగు మార్పులను రికార్డు చేయుట.*

60. (1) రిజిస్టరు చేయబడిన ఫర్మ్ పేరునుగాని, వర్తకముయొక్క ప్రధాన స్థలమునుగాని మార్చినపుడు, ఆ మార్పును నిర్దిష్టపరచుచు, 58వ పరిచ్ఛేదము క్రింద అవసరమగు రీతిలో సంతకము చేసి, సత్యాపన చేసిన ఒక వివరణను, నిహిత ఫీజుతోపాటు రిజిస్ట్రారుకు పంపవచ్చును.

(2) ఉపపరిచ్ఛేదము (1) యొక్క నిబంధనలు తగురీతిగా పాటింపబడినవని రిజిస్ట్రారుకు రూఢియైనపుడు, అతడు ఫర్ముల రిజిస్టరులో ఫర్ముకు సంబంధించిన నమోదును ఆ వివరణ ప్రకారము సవరించవలెను; మరియు ఫర్ముకు సంబంధించినదై 59వ పరిచ్ఛేదము క్రింద ఫైలు చేయబడిన వివరణతోపాటు దీనిని ఫైలు చేయవలెను.

*శాఖల మూసివేతను మరియు ప్రారంభమును గూర్చి వ్రాసియుంచుట.*

61. రిజిస్టరయిన ఫర్మ్ తన వర్తకపు ప్రధాన స్థలము కానట్టి ఏదేని స్థలమునందు వర్తకమును ఆపివేసినపుడు, లేక క్రొత్తగా ప్రారంభించినపుడు, ఫర్ముయొక్క భాగస్వామి లేక ఏజెంటు ఎవరైనను ఆ సమాచారమును రిజిస్ట్రారుకు తెలియజేయవచ్చును. రిజిస్ట్రారు ఫర్ముల రిజిస్టరులో ఆ ఫర్ముకు సంబంధించిన నమోదులో అట్టి సమాచారపు టిప్పణి వ్రాసియుంచి, ఫర్ముకు సంబంధించి 59వ పరిచ్ఛేదము క్రింద ఫైలు చేయబడిన వివరణతోపాటు ఆ సమాచార పత్రమును ఫైలు చేయవలెను.

*భాగస్వాముల పేర్ల, చిరునామాల మార్పులను వ్రాసియుంచుట.*

62. రిజిస్టరయిన ఫర్ములోని భాగస్వామి ఎవరైనను తన పేరును లేక స్థిర చిరునామాను మార్చుకొనినప్పుడు, ఆ మార్పును గూర్చిన సమాచారమును ఫర్ముయొక్క భాగస్వామిగాని, ఏజెంటుగాని రిజిస్ట్రారుకు తెలియజేయవలెను; రిజిస్ట్రారు 61వ పరిచ్ఛేదములోని నిబంధనల ప్రకారము దానిని గూర్చి చర్య తీసికొనవలెను.

*ఫర్ములోని మార్పులను దాని విఘటనను గూర్చి రికార్డు చేయుట.*

63. (1) రిజిస్టరయిన ఫర్ములో సంఘటనాత్మక మార్పు కలిగినప్పుడుక్రొత్తగా ప్రవేశించు, కొనసాగు, లేక నిష్క్రమించు భాగస్వామి ఎవరైనను, రిజిస్టరయిన ఫర్మ్ విఘటితమైనప్పుడు, విఘటనకు అవ్యవహిత పూర్వము భాగస్వామిగానున్న వ్యక్తి ఎవరైనను, లేక అట్టి భాగస్వామి, లేక వ్యక్తి నుండి ఈ విషయమున ప్రత్యేకముగా ప్రాధికారమును పొందిన అతని ఏజెంటైనను ఆ మార్పును లేక విఘటనను గూర్చి అది జరిగిన తేదీని నిర్దిష్టపరచుచు రిజిస్ట్రారుకు నోటీసు ఈయవచ్చును; రిజిస్ట్రారు ఆ నోటీసును ఫర్ముల రిజిస్టరులో ఆ ఫర్ముకు సంబంధించిన నమోదులో రికార్డు చేయవలెను. మరియు ఫర్ముకు సంబంధించి 59వ పరిచ్ఛేదము క్రింద ఫైలుచేయబడిన వివరణతోపాటు ఆ నోటీసును ఫైలుచేయవలెను.

*మైనరు యొక్క ఉపసంహారమును గూర్చి రికార్డు చేయుట.*

(2) ఫర్ములో భాగస్వామ్యపు మేలుచెందునట్లు చేర్చుకొనబడిన మైనరు మేజరై, భాగస్వామిగా నుండుటకు లేక భాగస్వామిగా నుండకుండుటకు ఎంచుకొనినప్పుడు, ఆ ఫర్మ్ అప్పుడు రిజిస్టరయిన ఫర్ముగా ఉన్నచో, అతడు గాని ఈ విషయమున ప్రత్యేకముగా ప్రాధికారము పొందిన అతని ఏజెంటు గాని, అతను భాగస్వామియైనాడని లేక భాగస్వామి కాలేదని రిజిస్ట్రారుకు నోటీసు నీయవచ్చును; రిజిస్ట్రారు ఉపపరిచ్ఛేదము (1)లోని నిబంధనల ప్రకారము ఆ నోటీసుకు సంబంధించి చర్య తీసికొనవలెను.

**పొరపాటులను సరిదిద్దుట.**

64. (1) ఏదేని ఫర్మ్‌కు సంబంధించి ఫర్మ్‌ల రిజిస్టరులో చేయబడిన నమోదులో జరిగిన ఏ పొరపాటునైనను, ఆ ఫర్మ్‌కు సంబంధించి ఈ అధ్యాయము క్రింద ఫైలు చేయబడిన దస్తావేజుల కనుగుణముగ నుండునట్లు సరిదిద్దుటకు రిజిస్ట్రారుకు ఎల్లప్పుడును అధికారము ఉండును.

(2) ఫర్మ్‌కు సంబంధించి ఈ అధ్యాయము క్రింద ఫైలు చేయబడిన ఏదేని దస్తావేజుపై సంతకము చేసిన పక్షకారులందరు దరఖాస్తు పెట్టుకొనిన మీదట, రిజిస్ట్రారు, ఆ దస్తావేజులోని, లేక ఫర్మ్‌ల రిజిస్టరులో దానిని గూర్చి వ్రాసియుంచ బడిన రికార్డు, లేక టిప్పణిలోని ఏదేని పొరపాటును సరిదిద్దవచ్చును.

**న్యాయస్థానపు ఉత్తరువు ద్వారా రిజిస్టరులో సవరణ.**

65. రిజిస్టరయిన ఫర్మ్‌కు సంబంధించిన ఏదేని విషయమును గూర్చి నిర్ణయము నొసగు న్యాయస్థానము, అట్టి ఫర్మ్‌కు సంబంధించిన ఫర్మ్‌ల రిజిస్టరు లోని ఏదేని నమోదులో, న్యాయస్థాననిర్ణయము పరిణామముగా చేయవలసిన ఏదేని సవరణను రిజిస్ట్రారు చేయవలెనని ఆదేశించవచ్చును. రిజిస్ట్రారు తదనుసారముగా నమోదును సవరించవలెను.

**రిజిస్టరును, ఫైలు చేయబడిన దస్తావేజులను తనిఖీచేయుట.**

66. (1) ఫర్మ్‌ల రిజిస్టరును విహితము చేయబడు ఫీజు చెల్లించిన ఏ వ్యక్తి యైనను తనిఖీ చేయుటకు అతనికి అందుబాటులో ఉంచవలెను.

(2) ఈ అధ్యాయము క్రింద ఫైలు చేయబడిన వివరణలు, నోటీసులు, మరియు సమాచారపత్రములన్నియు విహితము చేయబడిన షరతులకు లోబడియు, అట్టి ఫీజును చెల్లించినమీదటను తనిఖీ చేయబడుటకు అందుబాటులో నుంచబడవలెను.

**నకళ్లను ఇచ్చుట.**

67. దరఖాస్తు పెట్టుకొని, విహిత ఫీజు చెల్లించిన మీదట ఏ వ్యక్తికైనను, ఫర్మ్‌ల రిజిస్టరులోని ఏదేని నమోదుకు గాని అందలి కొంత భాగమునకు గాని నకలును రిజిస్ట్రారు తన చేవ్రాలుతో ధ్రువపరచి ఈయవలెను.

**సాక్ష్య నియమములు.**

68. (1) ఫర్మ్‌ల రిజిస్టరులో రికార్డు చేయబడిన లేక వ్రాసియుంచబడిన ఏదేని వివరణ, సమాచారము, లేక నోటీసు, ఏ వ్యక్తిచే లేక ఏ వ్యక్తి తరఫున అట్టి వివరణ, సమాచారము, లేక నోటీసుపై సంతకము చేయబడినదో ఆ వ్యక్తికి సంబంధించి అందులో తెలుపబడిన ఏదేని సంగతినిగూర్చి నిశ్చాయకమైన రుజువు అగును.

(2) ఫర్మ్‌ల రిజిస్టరులో ఫర్మ్‌కు సంబంధించిన నమోదు యొక్క ధ్రువీకృత నకలును, అట్టి ఫర్మ్ రిజిస్టరు చేయబడినదను సంగతిని గూర్చియు, అందు రికార్డు చేయబడిన లేక వ్రాసియుంచబడిన ఏదేని వివరణ, సమాచారము, లేక నోటీసులోని విషయములను గూర్చియు రుజువుగ దాఖలుచేయవచ్చును.

**రిజిస్టరు చేయకుండుట వలన కలిగెడు ప్రభావము.**

69. (1) ఫర్మ్ రిజిస్టరు చేయబడిననే తప్ప, మరియు దావావేయు వ్యక్తి ఫర్మ్‌ల రిజిస్టరులో ఫర్మ్‌లోని భాగస్వామిగా చూపబడియున్ననే లేక చూపబడి యుండిననే తప్ప, ఫర్మ్‌లో భాగస్వామిగ దావావేయు ఎవరేని వ్యక్తిచే గాని, అతని తరఫునగాని ఫర్మ్‌పై లేదా ఫర్మ్‌లో భాగస్వామియని లేక భాగస్వామిగా నుండి యుండెనని చెప్పబడెడు ఎవరేని వ్యక్తిపై, ఏదేని కాంట్రాక్టునుండి ఉత్పన్నమైన లేక ఈ చట్టము క్రింద యొసగబడిన హక్కును అమలుపరచుటకు ఏ న్యాయస్థానములోనైనను దావా ఏదియు వేయబడరాదు.

.......... ....

(2) ఫర్మ్ రిజిస్టరు చేయబడిననే తప్ప, మరియు దావావేయు వ్యక్తులు ఫర్మ్‌ల రిజిస్టరులో ఫర్మ్‌లోని భాగస్వాములుగ చూపబడియున్ననే లేక చూపబడి యుండిననే తప్ప, ఫర్మ్‌చేగాని, ఫర్మ్ తరఫునగాని ఎవరేని అన్యవ్యక్తిపై, ఏదేని కాంట్రాక్టు నుండి ఉత్పన్నమైన హక్కును అమలుపరచుటకు ఏ న్యాయస్థానములోను దావా ఏదియు వేయబడరాదు.

(3) ఉపపరిచ్ఛేదము (1) మరియు (2) యొక్క నిబంధనలు, ఏదేని కాంట్రాక్టు నుండి ఉత్పన్నమైన హక్కును అమలుపరచుటకైన ముజరా క్లెయిముకు లేక ఇతర చర్యకు కూడ వర్తించును. కానీ, అవి ఈ క్రింది వాటికి, అనగా—

(ఏ) ఫర్మయొక్క విఘటన కొరకు, లేక విఘటన చేయబడిన ఫర్మయొక్క లెక్కలకొరకు దావావేయు హక్కునుగాని, విఘటన చేయబడిన ఫర్మయొక్క ఆస్తిని రాబట్టుకొను హక్కును లేదా అధికారమును గాని అమలుపరచుటకు, లేక

(బీ) దివాలాతీసిన భాగస్వామి యొక్క ఆస్తిని రాబట్టుటకై, ప్రెసిడెన్సీ

1909 లోని 3వ చట్టము. పట్టణముల దివాలా చట్టము, 1909 క్రింద గాని, ప్రొవిన్షల్ దివాలా చట్టము,
1920 లోని 5వ చట్టము. 1920 క్రింద గాని, అఫీషియల్ అస్సైనీకి, రిసీవరుకు, లేక న్యాయస్థానమునకు గల అధికారములకు,

భంగము కలిగింపవు.

(4) ఈ పరిచ్ఛేదము—

(ఏ) ఈ చట్టము విస్తరించు రాజ్యక్షేత్రములలో వర్తక స్థలము లేనట్టి, లేక సదరు రాజ్యక్షేత్రములలోని ఏ ప్రాంతములకు 56వ పరిచ్ఛేదము క్రింది అధిసూచన ద్వారా ఈ అధ్యాయము వర్తించకుండునో ఆ ప్రాంతములలో వర్తక స్థలములు కలిగియున్నట్టి ఫర్మలకు లేక ఫర్మలలోని భాగస్వాములకు, లేక

(బీ) ప్రెసిడెన్సీ పట్టణములలో, ప్రెసిడెన్సీ లఘు వ్యాజ్య న్యాయస్థానముల

1882 లోని 15వ చట్టము. చట్టము, 1882 లోని 19వ పరిచ్ఛేదములో నిర్దిష్టపరచబడిన మాదిరిది కానట్టియు, లేక ప్రెసిడెన్సీ పట్టణముల వెలుపల ప్రొవిన్షల్ లఘు వ్యాజ్య న్యాయస్థానముల

1887 లోని 9వ చట్టము. చట్టము, 1887కు గల రెండవ అనుసూచిలో నిర్దిష్టపరచబడిన మాదిరిది కానట్టియు, విలువలో వంద రూపాయలకు మించనిదియు అయిన ఏదేని దావా లేదా ముజరా క్లెయిముకు, లేక అట్టి దావా లేదా క్లెయిముకు అనుషంగికమైన లేక దాని నుండి ఉత్పన్నమైన అమలుచర్యకు లేదా ఇతర చర్యకు—

వర్తించదు.

తప్పుడు వివరములను అందజేసినందులకు శాస్తి. 70. తాను తప్పుడువని ఎరిగియున్న లేక యథార్థమైనవని తాను విశ్వసించని ఏదేని వివరములుగల లేక అసంపూర్ణమైనవని తాను ఎరిగియున్న లేదా సంపూర్ణముగానున్నవని తాను విశ్వసించని వివరములుగల ఏదేని వివరణ, సవరింపు వివరణ, నోటీసు లేక సమాచారపత్రముపై ఈ అధ్యాయము క్రింద సంతకము చేసిన ఎవరేని వ్యక్తి, మూడు మాసముల దాక ఉండగల కారావాసముతో లేక జుర్మానాతో లేక ఈ రెండింటితో శిక్షింపబడును.

నియమములు చేయు అధికారము. 71. (1) ఫర్మల రిజిస్ట్రారుకు పంపబడు దస్తావేజులతోపాటు పంపబడవలసిన ఫీజును, లేక ఫర్మల రిజిస్ట్రారు అభిరక్షలోనున్న దస్తావేజులను తనిఖీచేయుటకై లేదా ఫర్మల రిజిస్టరునుండి నకళ్లను పొందుటకై చెల్లింపబడవలసిన ఫీజును విహితము చేయుచు రాజ్య ప్రభుత్వము రాజపత్రములో అధిసూచన ద్వారా నియమములను చేయవచ్చును:

అయితే, అట్టి ఫీజు అనుసూచి-1లో నిర్దిష్టపరచిన గరిష్ఠ ఫీజును మించరాదు.

(2) రాజ్య ప్రభుత్వము ఈ క్రింది వాటి కొరకు కూడ నియమములను చేయవచ్చును—

(ఏ) 58వ పరిచ్ఛేదము క్రింద సమర్పింపబడిన వివరణ యొక్కయు, దాని సత్యాపన యొక్కయు ప్రరూపములను విహితముచేయుట;

(బీ) 60, 61, 62 మరియు 63వ పరిచ్ఛేదముల క్రింది వివరణలు, సమాచారపత్రములు మరియు నోటీసులు విహిత ప్రరూపములలో నుండవలెనని కోరుట, అందు కొరకు ప్రరూపమును విహితముచేయుట;

(సీ) ఫర్ముల రిజిస్టరు యొక్క ప్రరూపమును మరియు ఫర్ములకు సంబంధించిన నమోదులు అందులో ఏ పద్ధతిలో చేయబడవలెనో ఆ పద్ధతిని, మరియు అందులో చేయబడిన నమోదులు ఏ పద్ధతిలో సవరింపబడవలెనో ఆ పద్ధతిని లేక అందులో తప్పులను వ్రాయవలసిన పద్ధతిని విహితముచేయుట;

(డీ) వివాదములు ఉత్పన్నమైనపుడు రిజిస్ట్రారు అనుసరింపవలసిన ప్రక్రియను క్రమబద్ధము చేయుట;

(ఈ) రిజిస్ట్రారు స్వీకరించిన దస్తావేజులను ఫైలుచేయుటను క్రమబద్ధము చేయుట;

(ఎఫ్) అసలు-దస్తావేజులను తనిఖీ చేయుటకై షరతులను విహితము చేయుట;

(జీ) నకళ్ళు ఇచ్చుటను క్రమబద్ధము చేయుట;

(హెచ్) రిజిస్టర్ల మరియు దస్తావేజుల తొలగింపును క్రమబద్ధము చేయుట;

(ఐ) ఫర్ముల రిజిస్టరు యొక్క అనుక్రమణికను నిర్వహించుట కొరకును, దాని ప్రరూపము కొరకును నిబంధనలు చేయుట, మరియు

(జే) సాధారణముగ ఈ అధ్యాయము యొక్క ప్రయోజనములను నెరవేర్చుట.

(3) ఈ పరిచ్ఛేదము క్రింద చేయబడిన నియమములన్నియు ముందుగా ప్రచురింపబడవలెనను షరతుకులోనైయుండును.

(4) ఈ పరిచ్ఛేదము క్రింద రాజ్య ప్రభుత్వము చేసిన ప్రతి నియమమును, దానిని చేసిన వెంటనే రాజ్యశాసన మండలి సమక్షమున ఉంచవలెను.

## అధ్యాయము - 8

## అనుపూరక విషయములు.

72. ఈ చట్టము క్రింది పబ్లికు నోటీసును- పబ్లికు నోటీసు నిచ్చు పద్ధతి.

(ఏ) ఆ నోటీసు, రిజిస్టరయిన ఫర్ము నుండి ఎవరేని భాగస్వామి విరమించుకొనుటకు, లేక బహిష్కరింపబడుటకుగాని, రిజిస్టరయిన ఫర్ము విఘటనచేయబడుటకు గాని, రిజిస్టరయిన ఫర్ములో భాగస్వామ్యపు మేలు పొందునట్లు మైనరుగా చేర్చుకొనబడిన వ్యక్తి, మేజరైనంతనే అతడు ఆ ఫర్ములో భాగస్వామియగుటకు లేక భాగస్వామి కాకుండుటకు ఎంచుకొనుటకు గాని సంబంధించినదైనయెడల, ఫర్ముల రిజిస్ట్రారుకు 63వ పరిచ్ఛేదము క్రింద నోటీసు నిచ్చుటద్వారా మరియు రాజపత్రములోను, ఆ నోటీసు ఏ ఫర్ముకు సంబంధించినదో ఆ ఫర్ముయొక్క వర్తకస్థలము, లేక వర్తకపు ప్రధాన స్థలము ఏ జిల్లాలో నున్నదో ఆ జిల్లాలో ప్రాచుర్యముగల కనీసము ఒక ప్రాంతీయ భాషా వార్తాపత్రికలోను ప్రచురించుట ద్వారా;

(బీ) ఏదేని ఇతర సందర్భములో, రాజపత్రములోను, ఆ నోటీసు ఏ ఫర్ముకు సంబంధించినదో ఆ ఫర్ముయొక్క వర్తకస్థలము, లేక వర్తకపు ప్రధాన స్థలము ఏ జిల్లాలోనున్నదో ఆ జిల్లాలో ప్రాచుర్యముగల కనీసము ఒక ప్రాంతీయ భాషా వార్తా పత్రికలోను ప్రచురించుట ద్వారా,

[illegible]

73 (రద్దు) రద్దుచేయు చట్టము, 1938 (1938 లోని 1వ చట్టము) 2వ పరిచ్ఛేదము మరియు అనుసూచిద్వారా రద్దు చేయబడినది.

వ్యావృత్తులు 74. ఈ చట్టములోనైనను, ఈ చట్టము ద్వారా రద్దు చేసిన దేనిలోనైనను ఉన్నదేదియు—

(ఏ) ఈ చట్టము ప్రారంభమగుటకు పూర్వము అదివరకే ఆర్జింపబడిన, ప్రాప్తించిన లేక ఏర్పడిన ఏదేని హక్కుకు, హక్కు మూలమునకు, హితమునకు, బాధ్యతకు లేక దాయిత్వమునకు, లేక

(బీ) ఏదేని అట్టి హక్కుమూలము, హితము, బాధ్యత, లేక దాయిత్వమును గూర్చి ఏదేని శాసనిక చర్యకు, లేక ప్రత్యుపాయమునకు లేక ఈ చట్టము ప్రారంభ మగుటకు పూర్వము చేసిన లేక అనుభవించిన దేనికైనను, లేక

(సీ) ఈ చట్టము ప్రారంభమగుటకు పూర్వము చేసిన లేక అనుభవించిన దేనికైనను, లేక

(డీ) ఈ చట్టముద్వారా అభివ్యక్తముగా రద్దుచేయబడనిదై భాగస్వామ్యమునకు సంబంధించిన ఏదేని అనుశాసనమునకు, లేక

(ఈ) భాగస్వామ్యమునకు సంబంధించియుండు ఏదేని దివాలా నియమమునకులేక

(ఎఫ్) ఈ చట్టమునకు అసంగతముగా లేని ఏదేని శాసన నియమమునకు,

భంగము కలిగించదు లేక భంగము కలిగించునదిగ భావించబడరాదు.

## అనుసూచి — 1

### గరిష్ఠ ఫీజు.

(71వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1) చూడుడు)

| ఫీజు చెల్లించవలసిన దస్తావేజు లేక కార్యము | గరిష్ఠ ఫీజు |
|---|---|
| 58వ పరిచ్ఛేదము క్రింది వివరణ | మూడు రూపాయలు |
| 60వ పరిచ్ఛేదము క్రింది వివరణ | ఒక రూపాయి |
| 61వ పరిచ్ఛేదము క్రింది సమాచారపత్రము | ఒక రూపాయి |
| 62వ పరిచ్ఛేదము క్రింది సమాచారపత్రము | ఒక రూపాయి |
| 63వ పరిచ్ఛేదము క్రింది నోటీసు | ఒక రూపాయి |
| 64వ పరిచ్ఛేదము క్రింది దరఖాస్తు | ఒక రూపాయి |
| 66వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) క్రింది ఫర్ముల రిజిస్ట్రరు యొక్క తనిఖీ. | రిజిస్ట్రరు యొక్క ఒక సంపుటమును తనిఖీ చేయుటకు ఎనిమిది అణాలు. |
| 66వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (2) క్రింది ఫర్ముకు సంబంధించిన దస్తావేజుల తనిఖీ. | ఒక ఫర్ముకు సంబంధించిన దస్తావేజు లన్నిటిని తనిఖీ చేయుటకొరకు ఎనిమిది అణాలు. |
| ఫర్ముల రిజిస్ట్రరు నుండి నకళ్లు. | ప్రతి వంద పదములకు లేక అందలి ఏదేని భాగమునకు నాలుగు అణాలు. |

## అనుసూచి — 2

### అనుశాసనముల రద్దు.

రద్దు చేయు చట్టము, 1938, (1938 లోని 1వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదము మరియు అనుసూచి ద్వారా రద్దు చేయబడినది.